epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:40

24 క్యారెట్లు 152,840.00 | కిలో వెండి 2,50,000.00 | chourastha Digitals | 26.09.2026 శనివారం, హైదరాబాద్

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

- తక్షణమే సీఈసీ పదవికి చేయాలి
- అప్రూవర్‌గా మారాలి
- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

2లో





## బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకున్న రేవంత్‌రెడ్డి

- కేరళంలో వీచే రాజకీయ మార్పు గాలులు
- ఢిల్లీలో సునామీలా మారతాయి
- ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశిష్ట ప్రజాసేవ
- దేశంలో మతతత్వ శక్తులను అడ్డుకోవడమే
- ఆర్యదాన్ మొహమ్మద్‌కు ఇచ్చే నివాళి
- సీఎం రేవంత్‌రెడ్డి

2లో

కేరళంలో వీచే రాజకీయ మార్పు గాలులు ఢిల్లీలో సునామీలా మారతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సాధారణంగా రుతుపవనాలు కేరళలో ప్రారంభమై అనంతరం కర్ణాటక, తెలంగాణ, యూపీ, బెంగాల్‌కు విస్తరిస్తాయని, రాజకీయాల్లోనూ అదే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## నవంబర్ చివర్లో ఖైరతాబాద్ ఉపఎన్నిక

### సుప్రీంకోర్టు తీర్పుతో ఉపఎన్నిక అనివార్యం

గురువారం సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఉపఎన్నిక ఖరారైంది. 2023లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎంపికైన దానం నాగేందర్‌పై కొద్ది రోజుల క్రితం అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. దానం నాగేందర్ మాజీ ఎమ్మెల్యేగా మారడంతో ఆరునెలల్లోపు ఉప ఎన్నిక నిర్వహించాల్సిన పరిస్థితులు అనివార్యమయ్యాయి.

- దానం మాజీ ఎమ్మెల్యేగా మారడంతో
- ఆరు నెలల్లోపు ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక
- 'సర్' పూర్తయ్యాకే మోగనున్న నగారా
- ఖైరతాబాద్‌పై 3 పార్టీల ఫోకస్
- 2023లో ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పి.విజయారెడ్డి
- బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్
- ఇప్పుడు ఇద్దరు కాంగ్రెస్ పార్టీలోనే
- పీసీసీ, ఏఐసీసీ ఎవరికి టికెట్ ఇస్తుందోనన్న ఉత్కంఠ
- ఎలాగైనా మళ్ళీ గెలవాలని బీఆర్ఎస్ పట్టు
- ఖైరతాబాద్ లో బిజెపి నేతల సన్నాహక సమావేశాలు



**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ(ఎస్ఐఆర్) పూర్తయ్యాకే బై ఎలక్షన్ ఉంటుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. సర్ ప్రక్రియ ప్రకారం నవంబరు 9న ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. దీంతో నవంబరు మూడో వారం నుంచి వచ్చే ఏడాది మార్చి తొలివారం లోపు ఎప్పుడైనా ఖైరతాబాద్ ఉప ఎన్నిక జరిగే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో 90 వేల మంది ఓటర్లకు ఎన్నికల అధికారులు వివరాల్లో తేడాలున్న కారణంగా నోటీసులు ఇచ్చారు. నోటీసులకు సరైన సమాధానాలను ఇవ్వకపోతే భారీగా ఓట్లు గల్లంతయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడగానే కాంగ్రెస్ పార్టీ తరపున రాబోయే ఉప ఎన్నికల్లో పోటీచేసి ఘన విజయం సాధిస్తానని దానం నాగేందర్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పి.విజయారెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆమెపైనే దానం బీఆర్ఎస్ నుంచి గెలిచారు. ప్రస్తుతం ఇద్దరు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. పీసీసీ,

।మిగతా 2 లో।



## తెలంగాణను వణికిస్తున్న వాయుగుండం

- వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి
- గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంత ఈదురుగాలులు
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- రాబోయే 48 గంటలు భారీ వర్షా లు
- వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** బంగాళాఖాతంలో తీరం దాటిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటలుగా హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ, సూర్యాపేట, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో

।మిగతా 2 లో।



## బై బై గణేశా

### విఘ్నేశ్వరా వెళ్లి రావయ్యా

- గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు
- 11 రోజుల పాటు భక్తులతో విశేష పూజలందుకున్న ఖైరతాబాద్ గణనాథుడు
- అంగరంగ వైభవంగా నిమజ్జనం
- మహాగణపతిని దర్శించుకునేందుకు అశేషంగా వచ్చిన భక్తులు
- భారీ భద్రతా వలయంలో హైదరాబాద్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** అశేష భక్త వాహిని జయజయధ్వానాల మధ్య ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది. 11 రోజుల పాటు భక్తులతో ధూపదీప నైవేద్యాలందుకున్న ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరుకున్నాడు. ఈ క్రతువును చూసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో హైదరాబాద్ నగరం జనసంద్రంగా మారింది. తొలుత బాహుబలి క్రేన్‌లో సాంకేతిక లోపంతో బడా గణేశ్ టస్కర్‌పైకి ఆలస్యంగా

।మిగతా 2 లో।



## కేంద్రం నన్ను ఎన్‌కౌంటర్ చేస్తుందేమో

- అనేక బెదిరింపులు వస్తున్నాయి
- అమిత్ షా రాజీనామా చేయాలి
- సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్

2లో

## బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి



- 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు
- రాహుల్ గాంధీ ఇప్పటికే ఆధారాలు చూపించాడు
- ఎన్నికల ప్రక్రియలో ఏ రకమైన జోక్యం చేసుకున్నా
- అది ప్రజాస్వామ్యపరంగా, రాజ్యాంగపరంగా తీవ్రమైన నేరం
- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ

2లో

# నవంబర్ చివర్లో ఖైరతాబాద్ ఉపఎన్నిక

**తరువాయి భాగం**

ఏఐసీసీ ఎవరికి టికెట్ ఇస్తుందో అనే దానిపై క్లారిటీ రావాల్సి ఉంది. 2023 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచినట్టే ఈ సారి కూడా ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ గెలవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్టుదలతో ఉన్నారు. గురువారం రాత్రి అందుబాటులో ఉన్న సీనియర్ నేతలతో అంతర్గతంగా చర్చించినట్లు సమాచారం. ఇక బీజేపీ నుంచి ఆ పార్టీ సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డిని పోటీ చేయించేందుకు అగ్రనేతలు నిర్ణయించారు. రెండురోజుల క్రితమే భారతీయ జనతా పార్టీ ఖైరతాబాద్ నేతలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

**పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలి**


ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటీషన్‌పై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తోందని ఆ పార్టీ విప్ కేపీ వివేకానంద అన్నారు. బైపోల్‌కు వెళ్లాల్సిందేనని కోర్టు స్పష్టం చేసే అంశం కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు.

**ఫిరాయింపు రాజకీయాలకు చెంపపెట్టు**

దానం నాగేందర్‌పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విజయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఈ పరిణామం ఫిరాయింపు రాజకీయాలకు చెంపపెట్టు వంటిదని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గుండాల మట్టి కన్న యోధుడు

- శ్రమజీవుల గొంతుక కామ్రేడ్ ముక్తార్ పాషా
- 'నీ అడుగులు ఉద్యమానికి మార్గదర్శనం...
- నీ జ్ఞాపకాలు కార్మిక లోకానికి నిరంతర ఇంధనం
- జాతీయ స్థాయి కార్మిక నాయకుడి వర్ధంతి సందర్భంగా శ్రమజీవుల అశ్రునయనాల నివాళి



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

ఏ పోరాటమైతే బాధితుడికి తోడవుతుందో, ఏ గొంతుకైతే నిరుపేదవాడి ఆక్రందనను ప్రతిధ్వనిస్తుందో... ఆ పోరాటమే ఊపిరిగా, ఆ గొంతుకే ఆయుధంగా తుది శ్వాస వరకు సమరశీల బాటలో సాగిన సమరయోధుడు కామ్రేడ్ ముక్తార్ పాషా. ఆయన వర్ధంతి సందర్భంగా గుండాలలో ప్రజానేతకు కుటుంబ సభ్యులు, శ్రమజీవులు, విప్లవాభిమానులు అశ్రునయనాలతో విప్లవ నివాళులర్పించారు.

**పోరాట పురిటిగడ్డ నుంచి చైతన్య ప్రయాణం:**

గుండాల మట్టిలో జన్మించిన ముక్తార్ పాషా చిన్నతనంలోనే సమాజంలోని అసమానతలను చూసి రగిలిపోయారు. విద్యార్థి దశలోనే నాటి సమర నాయకులైన దొరన్న, బాటన్న, పుల్లారెడ్డి, జనార్ధన్ రెడ్డిల ధీరత్వాన్ని, పోరాట పటిమను చూసి ప్రభావితమయ్యారు. ఆ స్ఫూర్తితోనే శ్రమజీవుల పక్షాన నిలబడాలనే నిశ్చయంతో విప్లవ విద్యార్థి సంఘం ద్వారా సమర బాట పట్టారు. చదువు కోసం ఇల్లందు చేరుకున్న పాషన్న, విద్యార్థుల హక్కుల కోసం మొదలుపెట్టిన పోరాటాన్ని అఖిల భారత కార్మిక సంఘాల సమైక్య జాతీయ కార్యదర్శి స్థాయి వరకు తీసుకెళ్లారు.

**మూడు పదుల సమర ప్రస్థానం శ్రమజీవుల పక్షాన సమరభేరి:***

మూడు పదుల కాలం పాటు ఆయన చేసిన పోరాటాలు చరిత్ర పుటల్లో నిలిచిపోయాయి శ్రమకు తగిన ఫలితం పెంకుటిళ్ళ తయారీ కార్మికుల స్థితిగతులను మార్చడానికి ప్రత్యేక సంఘాన్ని నిర్మించి, ప్రతి ఏటా నూతన వేతన ఒప్పందాలు అమలయ్యేలా యాజమాన్యాల మెడలు వంచారు. ఉపాధి పరిరక్షణ గనుల్లో కార్మికుల పొట్టకొట్టే యంత్రాల రాకను నిరసిస్తూ ప్రాణాలను సైతం పణంగా పెట్టి యంత్రాంగంపై తిరుగుబాటు జెండా ఎగరేశారు.బాధితులకు అండగా గనుల తవ్వకాల్లో సర్వస్వం కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల కన్నీళ్లు తుడవడానికి సుదీర్ఘ న్యాయపోరాటం చేసి, బాధితులకు తగిన పరిహారం దక్కేలా విజయం సాధించారు.

***జైలు గోడలు తెంచలేని విప్లవ సంకల్పం:***

ప్రజా సమస్యలపై పోరాడుతూ ఎన్నిసార్లు జైలు శిక్షలు అనుభవించినా, నిరంకుశ నిర్బంధాలకు ఎదురొడ్డి నిలిచారే తప్ప ఏనాడూ వెనకడుగు వేయలేదు. బెదిరింపులకు లొంగని ఆయన నైజం, నిరుపేదల పట్ల ఆయన చూపిన ప్రేమ ప్రతి ఒక్కరి గుండెల్లో చెరిగిపోని ముద్ర వేసింది. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన రగిల్చిన ఉద్యమ జ్వాలలు నిరంతరం వెలుగుతూనే ఉంటాయని ఈ సందర్భంగా పలువురు నాయకులు కొనియాడారు.

**అమరుడు కామ్రేడ్ ముక్తార్ పాషా జీవించే ఉంటాడు!"***

**"కార్మికుల హక్కుల సమరయోధుడు ముక్తార్ పాషా అమర్ హై...**

# బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వివాదం చెలరేగిన నేపథ్యంలో, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ శుక్రవారం బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్ చేపట్టి దేశంలో 13 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. తన సోదరుడు రాహుల్ గాంధీ ఇందుకు సంబంధించిన ఆధారాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచారని అన్నారు. ఈ విషయంపై అధికార బీజేపీ ఇచ్చిన వివరణలను ఆమె తోసిపుచ్చారు. ఈ సమస్యను కేవలం ఒక రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయలేమని అన్నారు.

"ఎన్నికల ప్రక్రియలో ఏ రకమైన జోక్యం చేసుకున్నా, అది ప్రజాస్వామ్యపరంగా, రాజ్యాంగపరంగా తీవ్రమైన నేరం అవుతుంది. వారు (బీజేపీ) మన ఎన్నికల్లో జోక్యం చేసుకుంటుంటే, వారి నాయకత్వం ఎన్నికల సంఘం చేత ఇలా చేయిస్తుంటే, అది దేశద్రోహ చర్య అవుతుంది. వారు ఈ విషయాన్ని గ్రహించాలి. అలాగే వారు ఆ బాధ్యతను తీసుకోవాలి. ఒకవేళ వారు ఎలా చేయకపోతే ఎందుకు బహిరంగంగా చెప్పలేకపోతున్నారు. దేనికి వాళ్లు భయపడుతున్నారు?" అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అంతేకాదు ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే పద్ధతి చాలా కాలంగా కొనసాగుతోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. "వారు ఎన్నికలను రిగ్గింగ్ చేయడం మొదలు పెట్టిన ఎన్ని ఏళ్లు అయ్యింది?" అని నిలదీశారు. ఎస్ఐఆర్, ఎన్నికల సంఘం పనితీరుపై రాజకీయ ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆమె ఈ ఘాటు విమర్శలు చేయడం గమనార్హం.

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలకు డిమాండ్**

కాగా, ఎస్ఐఆర్ వివాదం నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా ప్రక్రియలో చట్టవిరుద్ధమైన చర్యలు జరిగినట్లు రుజువైతే, అందుకు బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

మరోవైపు సీఈసీపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు విపక్ష పార్టీలు కూడా సంకేతాలు ఇస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రియాంక గాంధీని అడగగా, దీనిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో చర్చించి, ఏం చేయాలో నిర్ణయిస్తామని ఆమె పేర్కొన్నారు.

మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. "సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆయనను ఎంపిక చేశారు. జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగంపై దాడులు చేస్తున్నప్పటికీ, అతనిని మోదీ, షా కాపాడుతున్నారు. 2024 ఎన్నికలకు ముందు సీఈసీపై చట్ట ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓ చట్టం తెచ్చారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయి. ఈ క్రమంలో ఓటు చోరీ చివరకు, చట్టం చోరీగా మారుతోంది" అని రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు.

తమపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పందించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ చట్టపరంగానే, నిబంధనల ప్రకారమే జరుగుతోందని ఈసీఐ స్పష్టం చేసింది. ఎన్నికల కమిషనర్ల మధ్య జరిగిన అంతర్గత చర్చలను సంస్థాగతమైన విబేధాలుగా పరిగణించలేని పేర్కొంది. అంతేకాదు ఎస్ఐఆర్‌పై తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని తేల్చిచెప్పింది.

# కేంద్రం నన్ను ఎన్‌కౌంటర్ చేస్తుందేమో

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**



సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు తనను ఎన్‌కౌంటర్‌లో హతమార్చే అవకాశం ఉందంటూ ఆయన గురువారం తీవ్ర అనుమానం వ్యక్తం చేశారు. తనను హతమారుస్తామంటూ బెదిరింపులు అనేక వచ్చాయని తెలిపారు. అయితే దేశాన్ని మేల్కొలిపే క్రమంలో ఎదురయ్యే ఎలాంటి పర్యవసానాలకైనా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈ మేరకు లేహ్ హింసాత్మక ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా జరిగిన ఒక సభలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.కాగా, లద్దాఖ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా కల్పించాలని, దానిని రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు ఆరో షెడ్యూలు పరిధిలోకి చేర్చాలని కోరుతూ గతేడాది సెప్టెంబరు 24న నిరసన ప్రదర్శన జరిగింది. ఈ నిరసనలో ప్రదర్శన హింసకు దారితీసి నలుగురు మరణించారని, అందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షానే బాధ్యత వహించాలని వాంగ్‌చుక్ అన్నారు. ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు.

'నన్ను జైలుకు పంపించారు. ఎక్కడో ఒకచోట నన్ను ఎన్‌కౌంటర్ చేసి హతమార్చవచ్చు కూడా. అది దేశానికి మేల్కొలుపు అవుతుంది' అని వాంగ్‌చుక్ అన్నారు. అలాగే గతేడాది జరిగిన లేహ్ అల్లర్లపై నిర్వహించిన న్యాయ విచారణ నివేదికను బయట పెట్టాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. ఆ నివేదికను బహిర్గతం చేయకుంటే లేహ్‌లో జరిగిన పోలీసు కాల్పులపై స్వతంత్ర విచారణ జరిపేందుకు ప్రజా ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు.



# బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకున్న రేవంత్‌రెడ్డి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

కేరళంలో వీచే రాజకీయ మార్పు గాలులు ఢిల్లీలో సునామీలా మారతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సాధారణంగా రుతుపవనాలు కేరళలో ప్రారంభమై అనంతరం కర్ణాటక, తెలంగాణ, యూపీ, బెంగాల్‌కు విస్తరిస్తాయని, రాజకీయాల్లోనూ అదే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరినప్పుడల్లా, అనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చరిత్ర చెబుతోందని రేవంత్‌రెడ్డి అన్నారు.కేరళంలోని నిలంబూర్‌లో ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశిష్ట ప్రజాసేవకు అందించే బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా సీఎం రేవంత్‌రెడ్డి అందుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు. దేశంలో మతతత్వ శక్తులను అడ్డుకోవడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు ఇచ్చే నివాళి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.కేరళం లౌకిక విలువలకు కట్టుబడి ఉన్న గడ్డ అని రేవంత్‌రెడ్డి కితాబిచ్చారు. భారత్ జోడో యాత్ర సమయంలో కేరళంలో పర్యటించానన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కేరళంలో పర్యటించి, నాయకత్వ మార్పునకు పిలుపునిచ్చినట్లు గుర్తుచేశారు. ప్రధాని మోదీ ఓటు చోరీ, నిధుల చోరీ, పార్టీ చోరీ సహా దేశ యువత భవిష్యత్‌ను కూడా చోరీ చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను గద్దె దించాలని రేవంత్‌రెడ్డి కోరారు. రాజ్యాంగ పరిరక్షణకు లౌకికవాదులు అంతా కలిగి రావాలని పిలుపునిచ్చారు.కేరళం కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ మొహమ్మద్ 8 సార్లు ఎమ్మెల్యేగా, 4 సార్లు మంత్రిగా రాజకీయాల్లో పనిచేశారు. రాజనీతిజ్ఞుడిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా ఆర్యదాన్ మొహమ్మద్ కేరళం ప్రజల మనసుల్లో నిలిచిపోయారని మొహమ్మద్ ఫౌండేషన్ పేర్కొంది.



# బై బై గణేశా

**తరువాయి భాగం**

చేరాడు. ఉదయం 6 గంటలకు ప్రారంభం కావాల్సిన శోభాయాత్ర, క్రేన్‌లో సమస్య కారణంగా 3 గంటల ఆలస్యంగా 9 గంటలకు ప్రారంభమైంది. 'జై బోలో గణేశ్ మహరాజ్ కీ జై' అంటూ భక్తుల జయజయధ్వానాలు మార్మోగాయి. అశేష భక్తజనావళి నినాదాల మధ్య ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరాడు.

**ఘనంగా ఖైరతాబాద్ గణేశుని శోభాయాత్ర**

బడా గణేశ్ శోభాయాత్ర ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. భక్తుల కోలాహలం మధ్య సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర ట్యాంక్‌బండ్ క్రేన్ 4 వద్దకు చేరుకుంది. భక్తులు గణనాథుడిపైకి పుష్పాలు చల్లుతూ, డోలు వాయిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆ గణనాథుని కడసారి చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. దారి పొడవునా జై బోలో గణేశ్ మహరాజ్ కీ అంటూ నీరాజనాలు పలికారు. సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి సచివాలయం మీదుగా సాగర తీరానికి గణేశుడు చేరుకున్నాడు. నిమజ్జనాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. నగరాన్ని భారీ భద్రతా వలయంలోకి తీసుకొచ్చారు. 20 వేల మందికి పైగా సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను రంగంలోకి దించారు. ఇక మహా నిమజ్జన శోభాయాత్రను క్షణ క్షణం పర్యవేక్షించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లు, హైరైజ్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది.



# తెలంగాణను వణికిస్తున్న వాయుగుండం

వాయుగుండం తీవ్రత ఎక్కువగా ఉంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం.. ఈ వాయుగుండం రాబోయే 24 నుండి 48 గంటల్లో మరింత బలపడి పశ్చిమవాయువ్య దిశగా పయనించే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో , ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేసింది. ముఖ్యంగా తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన భీకర వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు హెచ్చరించారు.

గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ మహాగణపతి..
బైబై గణేశా అంటూ వీడ్కోలు పలికిన భక్తులు

వర్షాల ధాటికి గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ జనజీవనం పూర్తిగా స్థంభించిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు ఉప్పొంగి రోడ్లపైకి చేరడంతో కలెక్టర్లు అప్రమత్తమై స్థానిక రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. పలుచోట్ల వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువుల నీటిమట్టాలను నీటిపారుదల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

సమీప జిల్లాల పరిధిలోని పరిస్థితిని సమీక్షించిన జీహెచ్ఎంసీ, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు హైదరాబాద్ నగరంలో క్షేత్రస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లను తెరవవద్దని, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల వద్ద నిలబడవద్దని ప్రజలను హెచ్చరించారు. అత్యవసర సహాయం కోసం జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ నంబర్లతో పాటు జిల్లాల్లోని కలెక్టరేట్లలో రెస్క్యూ హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు.
వరి, పత్తి పంటలు చేతికి వచ్చే తరుణంలో ఇలాంటి అకాల కుండపోత వర్షాలు పడుతుండటంతో రైతాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. చేలలో ఉన్న పంటలు నీట మునిగే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల ప్రభావం మరో రెండు రోజుల పాటు కొనసాగే సూచనలు ఉన్నందున ప్రజలు, రైతులు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని అధికార యంత్రాంగం మైకుల ద్వారా విజ్ఞప్తి చేస్తోంది.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో :**




ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా శుక్రవారం నిరసనలు చేపట్టింది. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా, ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, సీఈసీ పదవి నుంచి ఆయనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది. జమ్మూకశ్మీర్, అసోం, ఉత్తరాఖండ్, బంగాల్ , ఉత్తరప్రదేశ్, చండీగఢ్, మణిపుర్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా రాష్ట్రాల్లోని ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు ర్యాలీ చేస్తూ సీఈసీకి 6i777 నినాదాలు చేశారు."ఓటు చోరీ చేస్తూ ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వాలను అధికారంలోకి తెస్తోంది. రాహుల్ గాంధీ ఈ విషయాన్ని గత మూడేళ్లుగా చెబుతూ వస్తున్నారు. ఈ రోజు అది వాస్తవమని రుజువైంది. రాహుల్ దృఢ సంకల్పానికి నేను సెల్యూట్ చేస్తున్నాను. ఇది దేశానికి ఎంతో మేలు చేస్తుంది. మాకు నిష్పక్షపాతమైన, స్వచ్ఛమైన ఎన్నికలు కావాలి" అని ఉత్తరాఖండ్ పీసీసీ అధ్యక్షుడు గణేశ్ గోడియాల్ అన్నారు. యూపీలోని లఖ్‌నవూలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు. హజ్రత్‌గంజ్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయాన్ని ముట్టడించేందుకు వారు ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. మణిపుర్‌లో కాంగ్రెస్ నేతలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేసి, విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ లాంఫెల్‌పట్‌లోని ప్రధాన ఎన్నికల కార్యాలయంవైపు ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. తర్వాత ఈ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారింది. దీనితో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. కాంగ్రెస్ నిరసనల నేపథ్యంలో పోలీసులు జమ్మూకశ్మీర్‌లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే శ్రీనగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శాసనసభ లోపల నిరసన ప్రదర్శనలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బ్యానర్లు ప్రదర్శించారు. అలాగే గువాహటి, చండీగఢ్, దేహ్రాదూన్, లఖ్‌నవూ, కోల్‌కతాల్లో కూడా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. మరోవైపు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తమ రాష్ట్ర విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆయా రాష్ట్రాల్లోని ఎన్నికల సంఘాల కార్యాలయాల వరకు పాదయాత్రలు నిర్వహించాలని స్పష్టం చేసింది.

**బ్రదర్- అప్రూవర్‌గా మారండి**

మరోవైపు బీఎల్ఓ అప్లికేషన్‌లో ప్రత్యేకంగా 'మార్క్ వీఐపీ' ఫీచర్‌ను సృష్టించి, ఓటర్ సమానత్వంపై ఎన్నికల సంఘం దాడి చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. అసలు ఎన్నికల సంఘం భారతీయ ఓటర్లను ఎందుకు, ఏ ప్రాతిపదికన వేరు చేస్తోందని ప్రశ్నించింది. అందుకే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారాలని, విచారణను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అంతేకాదు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టబోమని స్పష్టం చేసింది. కాగా, సీఈసీ తీసుకున్న ఎస్ఐఆర్‌తో సహా పలు కీలక నిర్ణయాలు చెల్లవని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్‌ఖేడా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు జరుగుతున్న అన్ని పరిణామాలను గమనిస్తోందని, సరైన సమయంలో సరైన చర్యలు తీసుకుంటుందనే నమ్మకం తమకు ఉందని ఆయన అన్నారు.ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఆదేశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 10 నెలల వ్యవధిలో కనీసం 14సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారని గురువారం ఓ ప్రముఖ పత్రిక తన నివేదికలో పేర్కొంది. దీనితో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. పలు ప్రతిపక్షపార్టీలు, సీజేపీ సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టాయి. అయితే ఎన్నికల కమిషనర్లు తెలిపిన సంస్థాగత అభ్యంతరాలను అసమ్మతిగా అభివర్ణించడాన్ని ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. ఇవన్నీ తమ రోజువారీ పనిలో భాగమేనని తెలిపింది. ఎస్ఐఆర్‌తో సహా అన్ని విషయాల్లో తుది నిర్ణయం ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఏదేమైనప్పటికీ, పార్లమెంట్ ఉభయ సభల్లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విపక్ష పార్టీలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ సెప్టెంబర్ 29న ఢిల్లీలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఎస్ఐఆర్, ఎన్నికల సంఘం అంతర్గత పనితీరు మొదలైన అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## నషా ముక్త్ భారత్ పై శస్త్ర పబ్లిక్ స్కూల్‌లో అవగాహన

**హుజురాబాద్, తెలంగాణ చౌరస్తా:** మత్తు పదార్థాల మాయలో పడి యువత భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దని పాఠశాల కరస్పాండెంట్ వేణుమాధవ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.శుక్రవారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా హుజురాబాద్ పట్టణంలోని శస్త్ర పబ్లిక్ స్కూల్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.... మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు,విద్యాభ్యాసం,వ్యక్తిగత జీవితం,కుటుంబాలపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.చెడు స్నేహాలు,మత్తు పదార్థాల వినియోగానికి దారితీసే పరిస్థితులకు దూరంగా ఉండాలని తెలిపారు.ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు.విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ముంజాల సంగీత,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం మీద దృష్టి పెట్టాలి

- ప్రైవేట్ హాస్పిటల్స్ పైన చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ హాస్పిటల్స్ లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్



**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:** కరీంనగర్ జిల్లాలో పెరుగుతున్న జ్వరాల నియంత్రణతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగుల దగ్గర అధిక డబ్బులు వసూళ్లు చేస్తూ అనవసర పరీక్షలు చేస్తూ ఇష్టం వచ్చినట్లు చేసే దోపిడీని అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆద్వర్యంలో జిల్లా వైద్య అరోగ్య అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ....కరీంనగర్ జిల్లాలో మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజలు తీవ్రంగా జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజురోజుకూ పెరుగుతుందని,ముఖ్యంగా డెంగ్యూ,మలేరియా,రక్త కణాలు తగ్గడం తోపాటు గొంతు నొప్పి, వైరల్ ఫీవర్ తదితర అరోగ్య సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నప్పటికీ,రోగుల రద్దీ నేపథ్యంలో వైద్య పరీక్షలు,మందులు,అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరుతుందని,జ్వరాలు,డెంగ్యూ, రక్త కణాలు తక్కువ కావడంతో కొంతమంది ప్రైవేట్ ఆసుపత్రులకు పోవడం ద్వారా రోగుల భయాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూలు చేస్తూ అవసరం లేకున్నా వివిధ వైద్య పరీక్షల పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడం,ఆసుపత్రి బిల్లుల్లో పారదర్శకత లేకపోవడం అనే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగ్యూ,వైరల్ ఫీవర్ తదితర చికిత్సలకు సంబంధించిన పరీక్షలు,మందులు,బెడ్ ఛార్జీలు, వైద్య సేవలు,ఇతర చార్జీలపై ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చెయ్యాలని,నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని,ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యం పేరుతో ఎవరూ అనవసర ఆర్థిక భారానికి గురికాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల పై ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి,నగర పార్టీ అధ్యక్షులు రంగరవేణి లక్ష్మణ్,జిల్లా సీనియర్ నాయకులు శ్రీరాములు రమేష్, బసవేణి రాజేందర్,చంటి శ్రీనివాస్,గర్షకుర్తి విద్యాసాగర్,కొత్వల అంజనేయులు,బండారి అభిరామ్,తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి వ్యక్తికి పెన్షన్ అందేలా చూస్తా

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్ ఖాన్ పేట్ గ్రామంలో పెన్షన్ దరఖాస్తుల ఇంటింటి వెరిఫికేషన్ భాగంగా వితంతు పెన్షన్, ఒంటరి మహిళల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి ఇంటింటి వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్ మాట్లాడుతూ...అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీఓ సురేందర్ కుమార్,సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్,కార్యదర్శి శంకర్,వార్డ్ సభ్యులు చిన్న, పాల్గొన్నారు.




## విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

- ప్రభుత్వ కళాశాల ఎదట పేపర్ ప్లేట్లతో నిరసన
- పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్

**వేములవాడ, తెలంగాణ చౌరస్తా:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ లోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరుతూ (ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ) పి డి ఎస్ యు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పేపర్ ప్లేట్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం,బ్రేక్ ఫాస్ట్ అమలు చేస్తామని చెప్పి,కేవలం కొన్ని జిల్లాలకే పరిమితం చేస్తూ నేటికీ కాలయాపన చేస్తూ విద్యార్థులతో జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జూనియర్ కళాశాలలో సరిగ్గా లెక్చరర్స్ లేక,గదులు,హాస్టల్ సరిపోక,విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఏమి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.మరోపక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేశాం,ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ పెడతున్నామని మాయమాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు.పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్లు విడుదల కాక సర్టిఫికెట్లు కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని,ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యా రంగ సమస్యను పరిష్కరించాలని,మధ్యాహ్నం భోజనం,బ్రేక్ ఫాస్ట్ ను తక్షణమే అమలు చేయాలన్నారు.విద్యార్థులకు మంచి చదువు అందించాలని,కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యారంగ సమస్యలను పరిష్కరించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా పిడిఎస్యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు లోకిని రమేష్,జిల్లా నాయకులు కోనేటి ప్రశాంత్,సిరిసిల్ల డివిజన్ నాయకులు శివ,కార్తీక్,వనజ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్ యూనిఫామ్స్,బెల్టుల పంపిణీ

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం అందించిన స్కూల్ యూనిఫామ్ బెల్ట్ లను గ్రామ సర్పంచ్ పోశాల శైలజసదానందం గౌడ్ పంపిణీ చేశారు. పాఠశాలలో డ్యూయల్ డెస్క్ (పెద్ద బెంచీలు) కావాలని సర్పంచ్ కి ప్రధానోపాధ్యాయులు వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ ఉపాధ్యాయులు లక్ష్మిపతి,రవీందర్, శ్రీనివాస్,శ్రీలత,మాలతీ,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చల్లా మనససతీష్,ఉయ్యాల శ్రీధర్,బొడ్డుపల్లి మల్లేష్,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామంలో 2.44 (రెండు కోట్ల నలభై నాలుగు) లక్షలతో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో పెద్దపెల్లి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు కి కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ మాట్లాడుతూ...ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అనునిత్యం ప్రజల కోసం మండల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాడన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గజనవేన సదయ్య,సర్పంచ్ బంగారి రమేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి,సర్పంచ్ లు బంగారి రమేష్,జిన్న రాంచంద్ర రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మునీర్,మాజీ సర్పంచ్ మదాసి సతీష్,ఉప సర్పంచ్ లు గోలి సుధాకర్,మేడి అశోక్,దర్మల రవి,జంగ అనిల్ మాజీ,ఎంపిటిసి రావి సదానందం,శంకర్,మొగిలి సదానందం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎనగంటి రవి,బద్రి,పింగిలి మల్లారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

- చినరావిరాల గ్రామ సర్పంచ్
- పబ్బత్ బాలకిషన్ గౌడ్



**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:** స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద సురకంటి సుమారెడ్డికి రూ.46,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శుక్రవారం అందజేశారు.బాధితురాలికి ఆర్థిక సహాయం అందించేందుకు ఎమ్మెల్యే చేసిన కృషికి చిన్నరావిరాల గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఆపదలో ఉన్న పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్,చిన్న రావిరాల గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు గాయపడిన గౌడ కార్మికుడికి పరామర్శ

- సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్
- గట్టు శ్రీనివాస్ గౌడ్ ఆరోగ్యంపై సర్పంచ్ ఆరా
- త్వరగా కోలుకోవాలని గౌడ సంఘం సభ్యుల ఆకాంక్ష

**కమాన్ పూర్,తెలంగాణ చౌరస్తా:** కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గట్టు శ్రీనివాస్ గౌడ్‌ను గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల ఈత చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు నిచ్చెన జారిపడటంతో శ్రీనివాస్ గౌడ్ వెన్నుముకకు తీవ్ర గాయమైంది. కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ గౌడ్ త్వరగా కోలుకుని సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. సర్పంచ్‌తో పాటు గౌడ సంఘం సభ్యులు బొంగోని వీరయ్య, గుర్రెపల్లి వెంకన్న, మల్యాల సతీష్, బుర్ర శ్రీనివాస్, మల్యాల నరేష్, మెడగొని శ్రీనివాస్ తదితరులు శ్రీనివాస్ గౌడ్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.




## ప్రతి రైతు ఎఫ్‌పీఓ షేర్లు తీసుకోవాలి

- ప్యాక్స్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు
- సహకార రంగం ద్వారా రైతుల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:** కమాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్) పరిధిలోని ప్రతి రైతు ఎఫ్‌పీఓ (రైతు ఉత్పత్తిదారుల సంస్థ) లో భాగస్వామ్యమై షేర్లు తీసుకోవాలని ప్యాక్స్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు పిలుపునిచ్చారు. కమాన్‌పూర్ పిఎసిఎస్ కార్యాలయంలో ఎఫ్‌పీఓలో సభ్యత్వం పొంది, వాటా ధనం చెల్లించిన రైతులకు పాలకవర్గం ఆధ్వర్యంలో గురువారం షేర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు మాట్లాడుతూ.. సహకార రంగం ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఎఫ్‌పీఓ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. రైతులు సంఘటితంగా ఏర్పడి ఎరువులు, విత్తనాల కొనుగోలుతో పాటు పంట ఉత్పత్తుల విక్రయాల ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని సూచించారు. ఒక్కో షేరు ధర 100 రూపాయలు ఉంటుందని, ప్రతి రైతు కనీసం 20 షేర్లు (రూ. 2000) తీసుకోవాలని కోరారు. ఎఫ్‌పీఓలో భాగస్వాములైన రైతులకు సొసైటీ ద్వారా అన్ని రకాల సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందుతాయని పేర్కొన్నారు.అనంతరం ప్యాక్స్ సీఈవో తిమ్మరాజు సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ, అసలు చెల్లించాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు అర్ధవార్షిక లెక్కల సమీక్ష పూర్తయిందని, స్వల్పకాలిక రుణాల వడ్డీని రైతులు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ తిందం తిరుపతి, డైరెక్టర్లు గుండేటి శ్రీమూర్తి, అడ్వాల చంద్రయ్య, వారాల నర్సింగం, బానోతు లక్ష్మి, సొసైటీ సిబ్బంది రవీందర్, కుమార్, సాబీర్ వాటాదారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## భవాని నగర్ కాలనీలో వైభవంగా గణేష్ నిమజ్జనం

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:** పీర్జాదిగూడ పర్వతాపూర్ 9వ డివిజన్ పరిధిలోని భవాని నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గణేష్ నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు.గణనాథుడి లడ్డూ ప్రసాదానికి నిర్వహించిన వేలంలో భక్తులు పోటీపడి మొదటి లడ్డూను రూ. 1,91,000/ సమర్పించి పి. సుమతి కిషన్ దంపతులు దక్కించుకోగా,రెండవ లడ్డూను రూ.62,000/ లకు లక్ష్మి శ్రవణ్ పాటిల్ దంపతులు కైవసం చేసుకున్నారు. అనంతరం వినాయక నిమజ్జన శోభాయాత్రను ఘనంగా ప్రారంభించారు.డప్పు వాయిద్యాలు, కోలాటాలు, వివిధ కళారూపాల ప్రదర్శనలు, కళాకారుల విన్యాసాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్ర పొడవునా గణపతి బప్పా మోరియా నినాదాలతో హోరెత్తించారు.ఈ కార్యక్రమంలో భవాని నగర్ కాలనీ ప్రతినిధులు డా.ఆర్. శ్రీనివాస్ గౌడ్, పి. గోపాల్, బి.రాము యాదవ్,సూర్యారావు, సత్తయ్య,డి. సైమన్, ఎం. నరేష్, ఎ.శ్రీనివాస్,ఆర్. సుధాకర్ రెడ్డి,ఎ.శ్రీనివాస్ గౌడ్, కే.సందీప్ రెడ్డి, ఎస్.మధుసూదన్ రెడ్డి, ఎం.మధు,సునీల్,ఆర్. రాహుల్,ఎస్.నాగరాజు, బి.నాగరాజు,శ్రవణ్ పాటిల్,వెంకటేష్,కిరణ్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నేడే 'డయల్ యువర్ డిఎమ్'



**ఇల్లందు భద్రాద్రి బ్యూరో,తెలంగాణ చౌరస్తా :** ఇల్లందు బస్సు డిపో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు డిపో పరిధిలోని సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు శనివారం 26.09.2026 మధ్యాహ్నం 12:00 గంటలకు 'డయల్ యువర్ బస్సు డిపో డిఎమ్ ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. ప్రయాణికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బస్సు సర్వీసుల వేళలు, కొత్త రూట్ల ఏర్పాటు, సౌకర్యాలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులను నేరుగా డిఎమ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.కావున ఇల్లందు పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ 'డయల్ యువర్ డిఎమ్' కార్యక్రమంలో భాగస్వాములై తమ సమస్యలను డిపో మేనేజర్‌కి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# సర్ ప్రక్రియతో 70 లక్షల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం

- ఈసీ విధానాలను సంస్కరించాలి
- సామాజికవేత్త దొనికెన కుమారస్వామి



**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

ఎన్నికల సంఘం లోపభూయిష్టమైన విధివిధానాలతో చేపట్టిన 'సర్' (SIR) ప్రక్రియ కారణంగా రాష్ట్రంలో దాదాపు 70 లక్షల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని సామాజికవేత్త దొనికెన కుమారస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.తొర్రూరు డివిజన్ కేంద్రంలో మీడియాతో మాట్లాడిన కుమారస్వామి.. సర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో సుమారు 3.50 కోట్ల జనాభా ఉండగా, అందులో 2.64 కోట్ల మందికి మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారని, అయితే ఆ ప్రక్రియ కూడా పూర్తిగా జరగలేదన్నారు. ఇప్పటివరకు సుమారు 1.43 కోట్ల మందికి మాత్రమే ఫారాలు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఫారాల పరిశీలనలో మరణించిన ఓటర్లు, చిరునామా మారిన లేదా గుర్తించలేని ఓటర్లు, పునరావృత ఓట్లను గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా నుంచి తొలగించే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇంకా పెద్ద సంఖ్యలో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు పంపిణీ చేసిన ఫారాల విషయంలోనే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కుమారస్వామి అన్నారు. తల్లిదండ్రుల గుర్తింపు ఆధారాలు, 2002 నాటి ఓటరు వివరాలు లేదా ఎన్నికల సంఘం సూచించిన ఇతర ఆధారాలు సమర్పించలేని ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. సరైన ఆధారాలు సమర్పించలేకపోతున్న అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.నోటీసులు అందుకున్న ఓటర్లలో గుర్తింపు ఆధారాలు సమర్పించిన వారిలో కూడా కొంతమంది వివరాలను మాత్రమే తుది జాబితాలో పరిగణనలోకి తీసుకుంటామని ఎన్నికల సంఘం చెబుతుండటం పట్ల కుమారస్వామి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటు హక్కు రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య హక్కు కావడంతో, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులతో పోల్చకుండా, తెలంగాణలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సర్ ప్రక్రియను సులభతరం చేయాలని ఆయన సూచించారు.సంక్లిష్టమైన నిబంధనల వల్ల ప్రజలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సర్ ప్రక్రియలో విధివిధానాలను పునఃసమీక్షించి, అవసరమైన సంస్కరణలు చేపట్టి, అధికార యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని దొనికెన కుమారస్వామి ఎన్నికల సంఘాన్ని కోరారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కూడా చొరవ చూపాలని సూచించారు.



# ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు అవసరం

- గుండారం సర్పంచ్ జంగిలి పోచాలు

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరిరక్షణ కొరకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని గుండారం గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు సూచించారు. కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గుండారం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఎక్స్‌రే పరీక్షల క్యాంపును సర్పంచ్ జంగిలి పోచాలు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది డాక్టర్ సంగీత, మంద రాజేశ్వరి, రామిడి పురుషోత్తం, కర్రి ఆవుల ఇందిరా, ఆశా వర్కర్లు దండే శారద, దండే లావణ్య, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం...!

- లక్ష్మీదేవిపల్లి జాతీయ రహదారిపై విద్యాసంస్థల ఉన్మాద వైఖరి..!
- క్రిమినల్ కేసులు పెట్టి విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి!
- లక్ష్మీదేవిపల్లి జాతీయ రహదారి దిగ్బంధానికి స్థానికుల హెచ్చరిక!
- తక్షణమే స్పందించకపోతే జిల్లా విద్యాశాఖ (డి ఇ ఓ ) కార్యాలయం ముట్టడి!
- వినాయక నిమజ్జనంలో చిన్నారుల చేత మందుగుండు సామాగ్రి మోయింపు..!
- ఎస్పీ, డిఎస్పీ ఆదేశాలనూ తుంగలో తొక్కిన శ్రీ నలంద, వివేకవర్ధిని, శ్రీ విద్య యాజమాన్యాలు..!
- విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసి, క్రిమినల్ కేసులు పెట్టాలని స్థానికుల ఆగ్రహం..!

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**



తరగతి గదులో "పర్యావరణాన్ని కాపాడండి...కాలుష్యాన్ని అరికట్టండి... బాణసంచా కాల్చడం ప్రమాదకరం" అంటూ వేదికలపై నీతులు వల్లించే విద్యాసంస్థలు బయటకొస్తే మాత్రం ముసుగు తీసి తమ వికృత స్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నాయి. వినాయక చవితి ఊరేగింపు పేరుతో చిన్నారుల చేతుల్లో పుస్తకాలు పెట్టాల్సింది పోయి, ఏకంగా ప్రాణాంతకమైన సారాజువ్వలు, పేలుడు సామాగ్రిని పెట్టి తమ ప్రచార ఆర్భాటాన్ని, వ్యాపార ఉన్మాదాన్ని ప్రదర్శించాయి.లక్ష్మీదేవిపల్లి ప్రధాన జాతీయ రహదారి (ఎంజీ రోడ్డు) పై ఈ ఘోరం వెలుగుచూసింది. లక్ష్మీదేవిపల్లి నుండి కొత్తగూడెం బస్టాండ్ వైపు వెళ్లే నిత్యం అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై శ్రీ నలంద, వివేకవర్ధిని జూనియర్ కాలేజీ శ్రీ విద్య పాఠశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో జరిగిన గణేష్ విగ్రహ ఊరేగింపులో ఈ దిగ్భ్రాంతికర సంఘటన చోటుచేసుకుంది. అభంశుభం తెలియని మైనర్ విద్యార్థుల చేతుల్లో ప్రమాదకరమైన మందు సామాగ్రి పెట్టి, కిక్కిరిసిన జాతీయ రహదారిపై నడిపించడం చూసి వాహనదారులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

***అధికారుల ఆదేశాలు బేఖాతరు!***

పర్యావరణాన్ని కలుషితం చేయవద్దని, నిమజ్జన ఊరేగింపుల్లో ప్రమాదకర పేలుడు పదార్థాలు వినియోగించవద్దని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డిఎస్పీ స్థాయి ఉన్నతాధికారులు పదే పదే స్పష్టమైన హెచ్చరికలు చేశారు. అయినప్పటికీ ఈ విద్యాసంస్థల యాజమాన్యాలు పోలీస్ యంత్రాంగాన్ని, జిల్లా యంత్రాంగాన్ని ఏమాత్రం లెక్కచేయకుండా ప్రవర్తించాయి. పోలీస్ ఉన్నతాధికారుల మాటలను తుంగలో తొక్కి, పిల్లల ప్రాణాలను పణంగా పెడుతూ ఈ చర్యలకు పాల్పడటం వారి బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా మారింది.

**చిన్న ప్రమాదం జరిగినా బాధ్యత ఎవరిది?**

రద్దీగా ఉండే జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు, జన సందోహం మధ్య పసిపిల్లలు ఆ పేలుడు సామాగ్రిని మోస్తుంటే ప్రయాణికులు భయాందోళనలతో షాక్‌కు గురయ్యారు.
ఏ చిన్న నిప్పురవ్వ ఎగిరిపడి ఆ పేలుడు సామాగ్రి పేలితే... ఆ పసిపిల్లల ప్రాణాలు గాల్లో కలసిపోవా?ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగి ఆ పసిపాపల శరీరాలు కాలిపోతే... ఆ ఘోరానికి విద్యాసంస్థల యాజమాన్యం బాధ్యత వహిస్తుందా? లేక ఆక్రందనలతో మిగిలే కన్నతల్లిదండ్రులు వహిస్తారా?
కేవలం తమ పబ్లిసిటీ పిచ్చి కోసం పసిపిల్లల ప్రాణాలను బలిపీఠంపై పెట్టే హక్కు ఈ విద్యాసంస్థల

**యాజమాన్యాలకు ఎవరిచ్చారు?విద్యను వ్యాపారంగా మార్చుకున్న వైనం!**

బదుల్లో "బాణసంచా కాల్చవద్దు... కాలుష్యం క్యాన్సర్ తెస్తుంది" అని సుదీర్ఘ ఉపన్యాసాలు దంచికొట్టే ఈ విద్యాసంస్థలు, రోడ్డుపైకి వచ్చేసరికి పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ, పొగతో కాలుష్యాన్ని పెంచుతూ, స్వయంగా పిల్లల చేతనే ఆ పేలుడు సామాగ్రిని మోపించడం విద్యా వ్యవస్థకే సిగ్గుచేటు. విద్యను కేవలం వ్యాపారంగా మార్చుకున్న ఈ యాజమాన్యాలకు పిల్లల భద్రత కంటే తమ ప్రచారమే ఎక్కువైందా? అని విద్యార్థి తల్లిదండ్రులు, మేధావులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకోకపోతే రహదారి దిగ్బంధం!**

పసిపిల్లల ప్రాణాలతో విచ్చలవిడిగా చెలగాటమాడిన శ్రీ నలంద, వివేకవర్ధిని జూనియర్ కాలేజీ శ్రీ విద్య పాఠశాల యాజమాన్యాలపై జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలను త్రోసిరాజని పిల్లల భద్రతను గాలికి వదిలేసిన ఈ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, వాటి గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని హెచ్చరిస్తున్నారు.లేని పక్షంలో పసిపిల్లల భద్రతను కోరే తల్లిదండ్రులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ (డి ఇ ఓ ) కార్యాలయాన్ని ముట్టడించడమే కాకుండా, లక్ష్మీదేవిపల్లి జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని స్థానికులు తీవ్రంగా హెచ్చరించారు.



# అశ్వారావుపేటలో 'జూనియర్ అండర్20' జిల్లా స్థాయి కబడ్డీ సమరం

- తెలంగాణ కబడ్డీ క్రీడాకారులకు వేదికగా అశ్వారావుపేట
- ఎమ్మెల్యే జారె ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నుంచి పోటీలు
- కబడ్డీ ప్రాంగణంగా అశ్వారావుపేట
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం
- గ్రామీణ క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం
- అశ్వారావుపేటలో 3 రోజుల పాటు జూనియర్ అండర్-20 కబడ్డీ టోర్నమెంట్
- భద్రాద్రి కొత్తగూడెం కబడ్డీ క్రీడాకారులకు తీపి కబురు
- అక్టోబర్ 10 నుంచి 12 వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని యువ కబడ్డీ క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే సువర్ణావకాశం లభించింది. అశ్వారావుపేట నియోజకవర్గంలో జూనియర్ అండర్20 బాలికల జిల్లా స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు సర్వం సిద్ధమవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక సహకారంతో ఈ టోర్నమెంట్ రూపుదిద్దుకుంది.ఈ పోటీలు అక్టోబర్ 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.

**గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకే..**

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులకు కొదవలేదని, వారికి సరైన వేదిక కల్పిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అద్భుతాలు సృష్టిస్తారనే ఉద్దేశంతోనే ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యువతలో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించడం ఈ పోటీల ముఖ్య లక్ష్యం.ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో పాటు టీ.జీ. కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కసాని వీరేష్ ముదిరాజ్, కార్యదర్శి మహేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కే. స్వాతి ముత్యం, ట్రెజరర్ కురకుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.అలాగే అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని పోటీల ఏర్పాట్లపై సమీక్షించారు.మూడు రోజుల పాటు జరిగే ఈ కబడ్డీ పండగను విజయవంతం చేయడానికి క్రీడాభిమానులు స్థానికులు సహకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.త్వరలోనే పాల్గొనే జట్లు, మ్యాచ్‌ల షెడ్యూల్ వివరాలను పూర్తిగా వెల్లడించనున్నారు.




# గణేష్ నిమజ్జన ఊరేగింపులో తల్వార్‌తో హల్‌చల్

- నలుగురి రిమాండ్ కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ.

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

గణేష్ నిమజ్జన ఊరేగింపులో మారణాయుధమైన తల్వార్‌ను ప్రదర్శిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన నలుగురు వ్యక్తులను కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో గరీబ్‌పేట గ్రామంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా, గరీబ్‌పేటకు చెందిన చిత్తరి లింగాప్రసాద్ చేతిలో తల్వార్ పట్టుకుని జనసమూహంలో తిరుగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించాడు. అతనితో పాటు పల్లె సతీష్, గోగుల నవీన్, నందతండాకు చెందిన భూక్య గణేష్‌లు కూడా ఊరేగింపులో పాల్గొంటూ హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకోగా, వారిని చూసి నలుగురూ పరారయ్యారు. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో టూ టౌన్ పోలీసులు ప్రత్యేక విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించారు. అనంతరం నిందితులు నలుగురినీ అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టి రిమాండ్‌కు తరలించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ... గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పండుగల వేళ మారణాయుధాలను ప్రదర్శించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజలకు భయాందోళనలు రేకెత్తించడం వంటి చర్యలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తేల్చిచెప్పారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.




# నాగార్జున స్కూల్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా:**

రామన్నపేట మండల కేంద్రంలోని నాగార్జున స్కూల్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శుక్రవారం వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థుల మధ్య ఘనంగా నిమజ్జనానికి తరలించారు.ఈ సందర్భంగా నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రేఖా నకిరేకంటి మాట్లాడుతూ, విద్యార్థులు భక్తిభావంతో పాటు పర్యావరణ పరిరక్షణ, క్రమశిక్షణను పాటిస్తూ పండుగలను జరుపుకోవాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు విద్యార్థుల్లో ఐక్యత, సంస్కృతి పట్ల అవగాహనను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వినాయకుడి నామస్మరణతో పాఠశాల పరిసరాలు సందడిగా మారాయి.



# తుఫాను బాధితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన
- దెబ్బతిన్న పంటల పరిశీలన
- రైతులు అధైర్యపడొద్దు
- పరిహారం అందేలా చూస్తాం
- ఎమ్మెల్యే జారె హామీ

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

అశ్వారావుపేట దమ్మపేట మండలం ఇటీవల కురిసిన భారీ తుఫాను వర్షాలకు నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి తగిన సాయం అందేలా అండగా ఉంటామని భద్రాచలం శాసనసభ్యులు జారె ఆదినారాయణ హామీ ఇచ్చారు. శుక్రవారం దమ్మపేట మండల పరిధిలోని జగ్గారం గ్రామపంచాయతీలో ఆయన విస్తృతంగా పర్యటించారు. తుఫాను ధాటికి దెబ్బతిన్న రహదారులను, వర్షపు నీటిలో మునిగిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సుడిగాలి తీవ్రతకు నేలకొరిగిన ఆయిల్ పామ్, జీడిమామిడి తోటలను సందర్శించిన ఎమ్మెల్యే, నష్టపోయిన రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యం కారణంగా రైతాంగానికి తీరని నష్టం వాటిల్లడం అత్యంత విచారకరమన్నారు. రైతులెవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, పంట నష్టానికి సంబంధించిన పూర్తి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించి బాధితులందరికీ నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అలాగే దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో స్థానిక సర్పంచ్ వంకా జానకీరామ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.